క్లుప్తంగా

దరఖాస్తులు నిల్

అంబాజీపేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఒక్క దరఖాస్తు నమోదు కాలేదని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెలీకాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేను కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



ఎమ్మెల్యే చిట్టిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్

మామిడికుదురు: నగరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తుల పూజలు

మామిడికుదురు: గోగన్నమఠంలో భక్తుల పూజలందుకుంటున్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. పూజ్యం జగన్నాథశర్మ, పూజ్యం విశ్వనాథశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా భూతబలి, శాలా ప్రదక్షిణం, శాలా ప్రవేశం, దీప ప్రజ్వలన, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, మార్జనలు, దీక్షాధారణ తదితర పూజలను ఘనంగా జరిపించారు. సాగి కేశవమూర్తిరాజు సునీత, సూర్యనారాయణరాజు, వెంకటలక్ష్మి, కల్యాణ్‌వర్మ, దీప్తి దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది.

జంతు వ్యర్థాలతో ఇబ్బందులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ప్రజలు జంతు వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ ఉండ్రు బాబ్జీరాజుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ప్లీడరు గారి మలుపు సమీపంలో పంట తద్వారా దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. షేక్‌నాగూర్, మాసాబీ, ఇస్మాయిల్, సలీమ్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు



విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎస్సై గంగాభవాని

పి.గన్నవరం: మైనర్లు, కళాశాల విద్యార్థులు, ఇతరులు ఎవరైనా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని పి.గన్నవరం ఎస్సై పి.గంగాభవాని హెచ్చరించారు. నేదునూరు శివారు టి.సావరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం గ్రేస్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు అధ్యక్షతన విద్యార్థులకు ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి సమాజంలో కొంతమంది యువతీ యువకులు, మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను ఇష్టం వచ్చినట్టు నడుపుతూ ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని ఆమె వివరించారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులపై కూడా కేసులు నమోదు చేస్తామని గంగాభవాని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఏడుకొండలు, కళాశాల కరస్పాండెంట్ నల్లి శ్రీచరణ్, వైస్ ప్రిన్సిపాల్ వై.వేణుగోపాలరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. స్థానిక ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు కమ్యూనిటీ హాలులో నర్సిపూడికి చెందిన మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుళ్లకు చెందిన జైకంటి ఆస్పత్రి నిర్వహించిన ఈవైద్య శిబిరాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు ప్రారంభించారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించారు. అవసరమనవారికి ఆపరేషన్లు చేస్తామని ఆప్తమాలజిస్ట్ గ్రేస్ తెలిపారు.

కుట్టుపై పట్టు.. ఉపాధికి మెట్టు

- విద్యార్థి దశ నుంచే అల్లికలు, ఆర్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ
- జీవనోపాధికి ఎంతో ఉపయోగం



గంగలకుర్రులో కుట్లు, అల్లికలు, వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన వాటిపై శిక్షణ ఇస్తున్న కుట్టు, ఆర్ట్ టీచర్లు

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులు చదువుతో పాటు చేతి వృత్తిలో నైపుణ్యం పొందుతున్నారు. చేతివృత్తిపై ఆకర్షితులయ్యేలా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహిస్తూ శిక్షణ అందిస్తున్నారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు, విద్యార్థినులకు విద్యతో పాటు స్వయంఉపాధిలో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో విద్యాశాఖ 30 ఏళ్ల క్రితం ప్రతి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కుట్లు, అల్లికలు, డ్రాయింగ్ నేర్పేందుకు ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను నియమించింది. విద్యార్థులకు చదువుతో పాటు చేతి వృత్తిలో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తూ కుట్టు, ఆర్ట్ టీచర్లకు మరింత ప్రోత్సాహాన్ని అందించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 20, కొత్తపేట నియోజకవర్గంలో 28, రాజోలు నియోజకవర్గంలో 19 మంది కుట్టుటీచర్లు ఉండగా సుమారు 25 వేల మంది విద్యార్థినులకు కుట్లు, అల్లికలు, డ్రాయింగ్ నేర్చుకుంటున్నారు. వారానికి మూడు పీరియడ్లు కుట్టు, అల్లికలు, వేస్ట్ మెటీరియల్‌తో బొమ్మలు తయారు చేయడం, వేస్ట్ బాటిల్స్, క్లాత్‌లు, వేస్ట్ పేపర్స్ వంటి వాటితో వస్తువులను తయారీపై శిక్షణ ఇస్తున్నారు. వీటితో పాటు 8, 9 తరగతి విద్యార్థిలకు ఆరి వర్క్ (మగ్గం) నేర్పిస్తున్నారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (శారీ)లపై శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులచే పేపర్ వేస్ట్ మెటీరియల్‌తో వివిధ రకాల గృహోపకర వస్తువులను తయారు చేసేందుకు శిక్షణ ఇచ్చారు. అలాగే డ్రాయింగ్‌లో లెటరింగ్, మెమరీ, మోడల్, ఫ్రీ హ్యాండ్, నేచురల్, జామెంట్రీ డ్రాయింగ్‌లతో పాటు మరో 10 రకాల ఆర్ట్‌లను విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు నేర్చుకున్న కుట్లు, అల్లికలు, కాగితాలతో తయారు చేసిన వస్తువులను ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఇటీవల అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో కుట్లు, అల్లికల వస్తువులతో పాటు డ్రాయింగ్‌లు పలువురిని ఆకట్టుకుని అందరి మన్ననలు పొందారు.

ఖాళీగా ఉండకూడదని..



ఓ పక్క చదువుకుంటూనే మరోపక్క కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకుంటూ కుట్లు, దుస్తులపై అల్లికలు నేర్చుకుంటున్నా. శిక్షణలో నేర్చుకున్న అంశాలు మరచిపోకుండా ఇంటి వద్ద కూడా సాధన చేస్తున్నా. నిత్యజీవితంలో కూడా కుట్లు, అల్లికలు ఎంతగానో దోహదపడతాయి.

– తరిపెట్ల లక్ష్మి, పదో తరగతి, గంగలకుర్రు

15 రకాల కుట్లు, అల్లికలు



కుట్లు అల్లికల్లో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాం. ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (శారీ)లపై శిక్షణ ఇస్తున్నాము. ఖాళీ సమయంలో అల్లికలు మర్చిపోకుండా మరొకరికి నేర్పుతూ గుర్తు చేస్తున్నాం. మగం వర్క్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. గృహోపకర అలంకార వస్తువుల తయారీ నేర్పుతున్నాం.

– కొల్లి లతాదేవి, కుట్టు టీచర్, గంగలకుర్రు

ఆసక్తి పెరుగుతోంది



కుట్లు, అల్లికలతో పాటు డ్రాయింగ్ వర్క్ తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నాం. పేపర్ వేస్ట్ మెటీరియల్‌తో విద్యార్థులకు వివిధ రకాల గృహోపకర వస్తువులను తయారు చేసేందుకు శిక్షణ ఇస్తున్నాం. సీజన్ల వారీగా ఉపయోగపడే వస్తువుల తయారీపై అవగాహన కల్పించడంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

– మట్టపర్తి సూర్యనారాయణ, ఆర్ట్ టీచర్, గంగలకుర్రు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



వెడ్డింగ్ కార్డు ముందు భాగం

అంబాజీపేట: వివాహ విషయంలో శుభలేఖలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటాయి. కాలానుగుణంగా శుభలేఖల ముద్రణలో కొత్త ఒరవడి ఎప్పటికప్పుడు నడుస్తోంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఒక జంట తమ పెళ్లి శుభలేఖను ఏటీఎం కార్డు మాదిరిగా తయారు చేయించి, వెనుక భాగంలో క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దానిని స్కాన్ చేస్తే పెళ్లి వివరాలు అన్ని సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతాయంటూ మా పెళ్లికి, రిసెప్షన్‌కు స్వాగతం పలుకుతూ యువతీ, యువకుల తల్లిదండ్రులు, బంధువులను, స్నేహితులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు సంబంధించి అంబాజీపేటకు చెందిన అప్పన రవికుమార్, రేవతి దంపతుల ద్వితీయ కుమార్తె వైష్ణవి వివాహం ఈ నెల ఒకటో తేదీన వివాహం, 5న రిసెప్షన్‌లకు రండి అంటూ ఆహ్వానిస్తున్నారు.



వెనుక భాగం

ప్రజలకు అందుబాటులో మండల స్థాయి స్పందన



కొత్తపేటలో ఆర్డీవో ముక్కంటి ఆధ్వర్యంలో స్పందనకు హాజరైన అధికారులు

కొత్తపేట: వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు ప్రజలు వ్యయప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి వెళ్లవలసిన అవసరం లేకుండా మండల కేంద్రంలోనే అధికారులందరితో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత స్పందన అనగానే ప్రజలు కలెక్టరేట్ బాట పడుతున్నారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు పరిష్కరించే చిన్న సమస్యలకు సైతం వ్యయ ప్రయాసలతో జిల్లా కేంద్రానికి వెళుతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం సచివాలయాల్లో క్రమం తప్పకుండా స్పందన నిర్వహించాలని గతంలోనే నిర్ణయించింది. అయినా అనేక మంది కలెక్టరేట్‌కు వెళుతున్నారు. దీంతో కలెక్టరేట్ స్పందన తరహాలోనే మండల స్థాయిలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. స్పందనకు వచ్చిన అర్జీలు తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డీవో ఎం.ముక్కంటి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్థానిక మండల ప్రజా పరిషత్ పాత మీటింగ్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రం అమలాపురంలో కలెక్టర్ స్పందన నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ టీవీ ఏర్పాటు చేశారు. ఏ ఒక్క శాఖకు మినహాయింపు లేకుండా అన్ని శాఖల అధికారులు ఈ స్పందనకు హాజరయ్యారు. ఎంపీడీఓ మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన స్పందనకు ఆర్డీవో ముక్కంటి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ స్పందనకు కేవలం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. ఈ రెండు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఇలాగే ప్రతి సోమవారం స్పందనకు అధికారులంతా హాజరుకావాలని ఆర్డీవో ఆదేశించారు. తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంఈఓ ఎం.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: ఉన్నతాధికారుల ఆదేశాలపై ప్రతి సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులతో గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వై.రామకుమారి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆమెతో పాటు, ఎంపీడీవో జీ.భీమారావు, ఎంఈవో నల్లి మనోహరం, ఏవో పీవీ నరసింహారావు, వెలుగు ఏపీఎం అజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, హౌసింగ్, ఎన్ఆర్‌జీఎస్, హెల్త్, ఎండోమెంట్స్ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా గ్రీవెన్స్‌కు రెవెన్యూ పరంగా ఒక ఫిర్యాదే అందింది.

మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయండి

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారంలో జరుగుతున్న మట్టి అక్రమ త్రవ్వకాలను సత్వరమే నిలిపివేయాలని లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన 'జగనన్నకు చెబుతాం' స్పందనలో భాగంగా ఆ గ్రామానికి చెందిన కక్షిదారుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో వీడియో కాన్ఫరెన్స్‌లో అందరి అధికారుల సమక్షంలో కలెక్టర్ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఏఓ వి.రామ్‌స్వరూప్, డీటీ జానకిరామయ్య, ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ, జేఈలు దర్నాల రామకృష్ణ, ఎం.పోశమ్మ, ఏవో ఎస్.లక్ష్మీలావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా కుడుపూడి ఎన్నికపై హర్షం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును కలసిన శెట్టిబలిజ నాయకులు

రాజోలు: ఎమ్మెల్సీగా కుడిపూడి సూర్యనారాయణరావు ఎన్నికపై రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం హర్షం వ్యక్తం చేసింది. కాకినాడలో ఎమ్మెల్సీగా నియామక పత్రాన్ని అందుకున్న సూర్యనారాయణరావును జెడ్పీ కార్యాలయం వద్ద రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులు, కొత్త 5 ఎంవీఏ పీటీఆర్ పొడిగింపు పనులు, హైటెన్షన్ లైను వెంబడి చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీంతో గూడపల్లి, గొల్లపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గుబ్బలపాలెం, గూడపల్లి పల్లిపాలెం, కరవాక గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం



పెదపట్నంలంకలో పార్టీ శ్రేణులకు ప్రచార కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: కుల మతాలకు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో సోమవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల, పార్టీ శ్రేణులతో 'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన కార్యక్రమం జరిగింది. జేసీఏ కన్వీనర్ జక్కంపూడి వాసు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యమన్న విషయం ప్రజలకు అర్థమైందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టాలన్నారు. చంద్రబాబు హయాంలో పాలనను, నేటి జగనన్న పాలనను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా జగన్ ముందుకు వెళ్తున్నారని, దాన్నే ప్రజలకు వివరించి వారి ఆదరాభిమానాలు పొందాలని చిట్టిబాబు హితబోధ చేశారు. వచ్చే నెల 18 నుంచి ప్రతి ఇంటికి వెళ్లడం, జగన్ పాలనను ప్రజలకు వివరించడం ఇదే ప్రధాన అజెండాగా పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, నక్కా వెంకటేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, గెద్దం కృష్ణమూర్తి, యూవీవీ సత్యనారాయణ, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం

మామిడికుదురు: మార్కెట్ కమిటీల ద్వారా రైతులు పండించిన పంటకు తగిన గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం చైర్మన్ నక్కా కృష్ణవేణి అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ కమిటీ నిధులతో రైతులకు ఉపయోగపడే లింకు రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రైతులకు మేలు చేసే విధంగా ప్రతి గ్రామంలో ఆర్బీకేలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు సబ్సిడీ ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రైతులకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చిట్టిబాబు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో కమిటీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, డైరెక్టర్లు యూవీవీ సత్యనారాయణ, కొప్పిశెట్టి హేమసుందర్, సిర్రా వెంకటేశ్వరరావు, గుత్తుల మధుసూదనరావు, తోట నర్సింహమూర్తి, అప్పన అనంతలక్ష్మి, తాటికాయల మధుబాబు, మానుకొండ నాగేంద్ర, చింతపల్లి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



వక్కలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

అంబాజీపేట: సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వినియోగించి పండించే పంటల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యసాయంలో నవధాన్యాలపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి, రీసోర్స్ పర్సన్ నాగవేణి మాట్లాడుతూ 30 రకాల నవధాన్యాలను పండించడం వల్ల భూసారం పెరగడంతో పాటు సారాన్ని పెంచుతాయన్నారు. అంతేకాకుండా వానపాములు పెరిగి భూమి గుల్లగా తయారై పైరు బాగా పెరిగి లాభదాయకమైన పంటను అందిస్తుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాసంశెట్టి పెదాబాబు, పినిపే మోహన్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, జనుపల్లి ఏడుకొండలు, వీఏఏ సౌజన్య, జి.పల్లయ్య, కె.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గాలికుంటు నిరోధక టీకాలు

రాజోలు: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆవులు, గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తామని సహాయ సంచాలకుడు డాక్టర్ హరికుమార్ సోమవారం తెలిపారు. రాజోలు, మామిడికుదురు మండలాల్లో మార్చి ఒకటో తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు టీకాలు వేస్తారన్నారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



గోపాలపురంలో కుర్రా శ్రీనును అభినందిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాల్లో మెజారిటీలో విజయం సాధించేందుకు పార్టీ, పార్టీ అనుబంధ విభాగాలు సమైక్యంగా పని చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కుర్రా వెంకటేశ్వరరావు (శ్రీను) జిల్లా, మండల ఏకలవ్య ఎరుకుల సంఘాల ప్రతినిధులతో కలసి సోమవారం గోపాలపురంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు శ్రీను జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిగా జగ్గిరెడ్డి, శ్రీనును అభినందిస్తూ పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. అలాగే పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సాగునీరు అందించాలంటూ రైతుల ఆందోళన



మొండెపులంక లాకు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

పి.గన్నవరం: మొండెపులంక వెస్ట్ కాలువ పరిధిలోని పంట భూములకు సక్రమంగా సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంత రైతులు సోమవారం మొండెపులంక లాకు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కాలువ పరిధిలో సుమారు 200 ఎకరాల భూమి సాగవుతుందని వివరించారు. ఇటీవల అమలు చేస్తున్న వంతుల వారీ విధానం వల్ల తమ చేలకు సక్రమంగా సాగునీరు అందక చేలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు విడుదల చేసే వంతు సమయాన్ని పెంచాలని కోరుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చిరుపొట్ట దశలో ఉన్న చేలు ఎండిపోతే నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. ఇటీవల వచ్చిన వరదలకు మొదటి పంట కోల్పోయామని, రెండో పంటకు కూడా నీరు సక్రమంగా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఆందోళనలో రైతులు ఆరుమిల్లి సాయిబాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, పిల్లి వెంకట నారాయణ, జి.శ్రీనివాస్, పిల్లి వెంకటేశ్వర్లు, కటికిరెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ చిరునామాలో మార్పులు

ఆలమూరు: ఆధార్‌కార్డులో చిరునామాలో తలెత్తే మార్పులను సవరించుకునేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రోజుల పాటు అవకాశం కలిప్ంచాయి. అందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో సోమవారం సంబంధిత కక్షిదారులు ఆధార్ చిరునామాలో మార్పులు చేయించుకున్నారు. మంగళవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని మండల స్థాయి అధికారుల బృందం పేర్కొంది. ఆధార్ కార్డు తీసుకున్న తరువాత చిరునామాలో మార్పులు తలెత్తితే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో అధార్ మార్పుల ప్రక్రియను గ్రామ సర్పంచ్‌లు ప్రారంభించారు.

డ్రెయిన్‌లో బోల్తా పడిన కారు

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లి గ్రామంలో సోమవారం ఓ కారు అదుపుతప్పి డ్రెయిన్‌లో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జయింది. దీనిపై ఏ ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు.

చలచల్లగా అనిపించెలే..



అంబాజీపేటలో ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగ మంచు

అంబాజీపేట: సూర్యోదయం అయినప్పటికీ... గ్రామాల్లో కప్పుకున్న మంచు తెరలు వీడడం లేదు. రోజు రోజుకూ సూర్యుడి తీక్షణత పెరుగుతోంది. మధ్యాహ్నం అయితే చాలు జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికి సంకోచిస్తున్నారు. అయినప్పటికీ నిశిరాత్రి వేళ చలి, మంచు ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. అంతేకాదు సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు కూడా పల్లెలను మంచు తెరలు వీడడంలేదు. అందుకు నిదర్శనం అంబాజీపేటలో దర్శనమిచ్చిన ఈ చిత్రం.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిపై కేసు

అయినవిల్లి: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎస్.పెదపాలెం వద్ద పసలపూడి సుబ్బారావు, మాగాపు నరేష్, కొట్నాల నవీన్, జనిపల్లి వివేక్, పులిదిండి అదిత్యలు గంజాయి విక్రయిస్తుండగా ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

అయినవిల్లి: తాగునీటి వనరులను వృథా చేయొద్దని జలజీవన్ మిషన్ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్లు, బి.చందు, బి.వెంకటరమన, జి.సురేంద్ర అన్నారు. సోమవారం శానపల్లిలంక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పంబల కుమారి అధ్యక్షతన జలజీవన్ మిషన్ పథకం పై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ 55 లీటర్ల నీటిని అందించమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకా వీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ పచ్చిమాల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి బి.ఆదిశంకరం తదితరులు ఉన్నారు.

మార్చి 3న యాజ్ఞవల్క్య ఆశ్రమ వార్షికోత్సవం

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో యాజ్ఞవల్క్య ఆశ్రమం 61వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ భక్త సమాజం సోమవారం తెలిపింది. మహర్షి యాజ్ఞవల్క్య పేరిట ఆశ్రమాన్ని రామతీర్థ స్వామిజీ అప్పట్లో స్థాపించారని, నాటి నుంచి నేటి వరకూ ఆశ్రమం ద్వారా భక్తులకు జ్ఞాన ప్రసాదాలు అందిస్తోందని భక్త సమాజం వెల్లడించింది. వార్షికోత్సవం సందర్భంగా ఆరోజు ఉదయం నిర్వహించే గాయత్రీ జ్ఞాన యజ్ఞంలో భక్తులు పాల్గొని ఆశ్రమ స్వామీజీ ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు తెలిపారు. వేద ప్రచారకులు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.